"డి.యస్పీ.సుందర్ సాక్ష్యాన్ని సమాధి చేయాలనుకోవడంలోని ఆంతర్యమేమిటి?..."

"నానీని సురక్షితంగా అప్పచెబితే పదివేలు బహుమతి ప్రకటించిన హోం మినిస్టర్ కోరుకుంటున్నది నిజంగా నానీ సురక్షితంగా దక్కటమేనా?"

అంతా దీనిపై చర్చ జరుగుతోంది.

నానీ అనే ఓ పసికందు ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం కూలిపోయే స్థితికి కారణమైన ఓ మారణాస్త్రమైపోయాడు.

ఈ సమస్య ఓ గాలివానగా మారడంతో శాంతి భద్రతల్ని కాపాడలేని ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునిచ్చారు రాష్ట్ర స్థాయిలో.

సరిగ్గా ఇలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇక్కడ రాష్ట్రాన్ని పాలిస్తున్నది మరో ప్రాంతీయ పార్టీ కావడంతో తనూ రంగంలోకి దిగిన సూచనగా ఓ పార్లమెంట్ కమిటీని వేసింది.

గనికొండ టూర్ చేసి అక్కడ పరిస్థితులు క్షుణ్ణంగా అధ్యయనం చేసే ప్రయత్నంలో హైద్రాబాద్ దాకా విమానంలో వచ్చి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గనికొండని చేరుకుంది పార్లమెంట్ కమిటీ.

నానీ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం మరో ప్రముఖ వార్తయిపోయింది.

సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్‌తో మాట్లాడిన రామసూరి అభ్యర్థన్ని సుప్రీంకోర్టు రిట్ పిటీషన్‌గా స్వీకరించింది.

మరుసటి రోజే రాష్ట్ర డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుకి సుప్రీంకోర్టు నుంచి ఓ టెలిగ్రాం అందింది.

దాని సారాంశం- నానీ అనే పసికందును నలభై ఎనిమిది గంటల్లో వెస్ట్ గోదావరి జిల్లా సెషన్స్ కోర్టులో హాజరు పరచమని...

దానితో రాష్ట్ర పోలీసు బలగం మొత్తము నానీని సురక్షితంగా కోర్టులో హాజరు పరిచే విధికి సన్నద్ధం చేయబడింది.

డి.జి.పి ఈ విషయాన్ని ఛీఫ్ మినిస్టర్‌కి తెలియచేసి తను వ్యక్తిగతంగా పరిశీలించడానికి గనికొండ బయలుదేరాడు.

ఆ రోజు....

ఉదయం పదిగంటలకల్లా పరిస్థితి చేయి దాటిపోతూందని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రాజధానికి రావడానికి మొహం చెల్లని హోమ్ శాఖామంత్రి అప్పారావుకి

పరిస్థితినంతా వివరించి వెంటనే రాజీనామా సమర్పించమన్నాడు ఫోన్ ద్వారా.

అప్పారావు శక్తి పూర్తిగా సన్నగిల్లిపోయినట్లు ఫోన్ క్రెడిల్ చేసి నిస్సత్తువగా సోఫాలో కూలబడిపోయాడు.

సరిగ్గా ఇదే సమయంలో....

డి.ఐ.జి., యస్పీలు డి.యస్పీ సుందర్ ని పోలీస్ సూపరింటెండెంట్ ఆఫీసుకి పిలిచి ఎంక్వయిరీ ప్రారంభించారు.

"నానీ ఎక్కడ....?" డి.ఐ.జి. అడిగారు.

"తెలీద్సార్!"

"రాందేవ్‌ని హత్య చేసిందెవరు?"

"తెలీద్సార్....."

"అనసూయని మర్డర్ చేసింది హరే కదూ...."

"తె.... తెలీదు సర్!"

"తవిటయ్యపై హత్యా ప్రయత్నం...."

" తెలీదు సర్....." అసంకల్పితంగా నోరు జారాడు డి.యస్పీ. సుందర్.

"డామిట్....." డి.ఐ.జి. ఆవేశంగా పైకి లేచాడు "తెలీదూ....ఒక పోలీసాఫీసరువయ్యుండీ.... సాక్ష్యాన్ని చెప్పడానికి వచ్చిన తవిటయ్యపై చేయి చేసుకున్న నువ్వు ఒక మంత్రి మోచేతి నీళ్ళు తాగుతూ నీ అధికారాన్ని దుర్వినియోగం చేసుకోవడం లేదంటే ఎలా నమ్మమంటావు మిస్టర్ సుందర్! నీ వుద్యోగం వూడాలంటే పెద్ద ప్రయత్నం అక్కరలేదు, యిప్పుడు నీపై వున్న అభియోగాలు చాలు-".

"సర్! అసలు....." డి.యస్పీ సుందర్ కంపించిపోతున్నాడు.

"కీప్ యువర్ మౌత్ షట్ ఐ సెడ్" ఆవేశాన్ని నిభాయించుకోలేక పోతున్నాడు డి ఐ జి "ఐ నో ఆల్ రియల్ కల్‌ప్రిట్.... చెప్పు అప్పుడు రాందేవ్‌ని, నిన్న అనసూయని చంపిన వారిని ఎందుకు కస్టడీలోకి తీసుకోలేదు? నిన్నిలా జాప్యం చేయమని ప్రోత్సహించిందెవరు?".

"సర్ -సరయిన ఆధారాలు లేక...."

"షేమ్......మిస్టర్ సుందర్! హోం మిష్టర్ గనికొండ విషయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్ లగాయితూ ఇంతవరకూ జరిగిన ప్రతి సంఘటన్నీ సమన్వయ పరుచుకుంటూ పోతే నీలాంటి అధికారి కాదు ఓ
సామాన్యమయిన కానిస్టేబుల్ చెప్పగలడు అసలు హంతకుడెవరో! ఇందులో హరి పాత్ర ఎంతో... సో మిస్టర్ సుందర్! పరిస్థితి విషమించింది.
వెంటనే నిన్ను సస్పెండ్ చెయ్యగలను కానీ..... నీకు బాస్ అయిన నాకూ సిగ్గుచేటే... పన్నెండు గంటలు గడువిస్తున్నాను. నాకు హంతకుడు కావాలి. అంతేకాదు... ఆ నానీ ఆచూకీ తెలియాలి.

వెళ్ళు .....పత్రికలు, ప్రజలూ మనమీద పూర్తిగా
ఉమ్మేయకముందే నీ అధికారాన్ని సక్రమ మార్గంలో సద్వినియోగపరుచుకో....
ప్రూవ్ యువర్ సెల్ఫ్....." హెచ్చరించాడు.

కదిలాడు డి.యస్పీ. సుందర్.

ఇప్పుడు హోంమినిస్టర్ అప్పారావు తనని
ఉద్ధరించే స్థితిలో లేడని అర్థమైపోయింది.

పన్నెండు గంటల గడువు....

హరిని పట్టుకోవాలి. కస్టడీలోకి తీసుకుని విషయాలు
కక్కించాలి. తనను తాను కాపాడుకోవాలి. నానీ ఆచూకీ వాడిద్వారానే తెలుసుకోవాలి.

పట్టణమంతా గాలింపు మొదలు పెట్టాడు డి.యస్పీ. సుందర్.

ఇంతటి కదలికకీ మూలకారకుడైన రామసూరి అన్నాడు యశస్వితో....
"కౌరవ వంశంలో అంత:కలహం మొదలయింది యశస్వీ.
ఇప్పుడు మనం
చేయాల్సింది ఒక్కటే.... మన కళ్ళముందు కదిలే ప్రతి వ్యక్తినీ ఓ కంట జాగ్రత్తగా
పరిశీలించాలి. పొంచి చూడాలి- ఇప్పుడుప్రతి క్షణమూ చాలా అమూల్యమైనదే....."

*　　*　　*　　*　　*

రాత్రి పదిగంటల వేళ.....

కాశీనాథశాస్త్రి ఒడిలో కూర్చున్న నానీ తాతయ్య చేరువలో పొందినంత
సంతృప్తితో కబుర్లు చెబుతున్నాడు.

"నువ్వు నాన్నమ్మకన్నా మంచి బామ్మవి" అంటూ తన మనసులోని మాటను
అనేశాడు

పేరిందేవి నానీని ఒడిలోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది. "తాతయ్యా!" కాశీనాథశాస్త్రి
ధ్యానం నుంచి తేరుకున్నాడు "నాన్నమ్మకి నేనంటే
కోపమెందుకు?"

ఏం తెలుసునని బదులు చెప్పగలడాయన. మృదువుగా నవ్వేస్తూ అన్నాడు.
"పసిపిల్లల్ని చూస్తే ఎవరు కోపగించుకుంటారు పసిడికొండా..... నువ్వు అల్లరి చేస్తే అలా
మందలించుండొచ్చు....."

"అసలు నేను అల్లరి చేయనుగా!"

"అంటే నువ్వు మంచి నానీని అన్నమాట....."

"తాతయ్య కూడా ఇలాగే అంటారన్న మాట -కాని నాన్నమ్మ ఎప్పుడూ అనేది కాదు....." మళ్లీ ప్రసక్తి అక్కడికే తీసుకొచ్చాడు నానీ.

"పడుకుంటావా నానీ!" అడిగింది పేరిందేవి....

"తాతయ్యా.... కొడుకుని ఎవరన్నా నాన్న చంపుతాడా?" టక్కున అడిగాడు నానీ.

అలాంటి ప్రశ్న నానీ ఎందుకడిగిందీ ఆయనకు అర్థం కాలేదు.

"ఉన్నారు నాన్నా! పురాణాల్లో హిరణ్యకశిపుడిలాంటి రాక్షసులు".

"అంటే..... ప్రహ్లాదుడి నాన్న అన్నమాట!" తల పంకించాడు. "ఏనుగులతో తొక్కించాడుగా....."

"అవును బాబూ! దేవుడంటే ఆ రాక్షసుడికి ద్వేషం.... అందుకే హరి భక్తుడైన కొడుకుని నానా రకాలుగా హింసించాడు."

"సొంతంగా కత్తితో చంపలేదేం?"

"ఎంత రాక్షసుడైనా తండ్రిగా..... అందుకే తనే కత్తి దూయలేక పోయాడు- చంపించే ప్రయత్నం మాత్రం చేశాడు."

"అంటే రాక్షసులకీ కొడుకులంటే ప్రేమన్న మాట-మరి మా నాన్న కెందుకు లేదూ?"

"ఏంట్రా గడుగ్గాయ్.....! యీ ప్రశ్నలేంటీ?" ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నాడు- నానీ మనసులో జరిగే సంఘర్షణేమిటో తెలుసుకోవాలని.

సరిగ్గా అదే సమయంలో ఓ యువకుడు వేగంగా ఇంటి ద్వారం దాటి లోపలకు దూసుకొచ్చాడు.

లోపల గదిలో వున్న కాశీనాథశాస్త్రి అది గమనించలేదు.

వచ్చింది తన కొడుకుగా గుర్తించిన పేరిందేవి ఆందోళనగా దగ్గరకు తీసుకుందతన్ని "ఏమైందిరా.... ఎందుకలా రొప్పుతున్నావు...." భర్తకెక్కడ వినిపిస్తుందోనని నెమ్మదిగా అడిగింది.

"పోలీసులు తరుముతున్నారమ్మా......"

"ఏమైందిరా.... ఏమైపోతున్నావు.... ఎలాంటి తండ్రికి పుట్టావు.... ఏ దారిలో అడుగు పెట్టావు...."

"ఇప్పుడెలా....?"

"అయిపోయిందమ్మా! ఆలస్యంగా కళ్ళు తెరిచాను. ఇప్పుడీ ఒక ఆపదనుంచీ గట్టెక్కగలిగితే మీరు చూపిన మార్గంలో బ్రతుకుతాను..... నా మాట నమ్ము."

సరిగ్గా అప్పుడే ఆ గదిలోకి నానితో సహా అడుగుపెట్టాడు కాశీనాథశాస్త్రి "అప్రాచ్యుడా! ఎందుకిలా వచ్చావు? నువ్వు దారితప్పిన రోజునే నాకు కొడుకే లేడని కర్మకాండల్ని పూర్తిచేశాను పో బయటికి....." అసహనంగా అరిచాడు.

“రాకరాక వచ్చాడండీ..ఎందుకలా
చీదరించుకుంటారు?”